# "అచ్చులో పేరు"

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆమె పేరు విద్యాధరి. కాని విద్యమాత్రం అంత లేదు. టెన్త్‌క్లాస్ రెండు సార్లు తప్పి, ఆ తర్వాత మూడోసారి పరీక్షకే వెళ్లలేదు.

చదువు మీద శ్రద్ధ వుంటే పాస్ అయివుండేది. ఆ శ్రద్ధ పుస్తకాల మీద వుంది. క్లాస్ పుస్తకాల మీద కాదు. పత్రికలు, నవలల మీద.

క్రమంగా తనూ ఓ రచయిత్రి నవాలనే ప్రగాఢ వాంఛ మొదలయింది విద్యాధరిలో. కథ రాద్దామని ప్రయత్నించింది కాని మొదటి పేరా కష్టపడి రాసాక కలం ముందుకు సాగలేదు

కథ వ్రాయడం కష్టమని తెలిసాక దాని జోలికి మళ్ళీ పోలేదు. కాని పత్రికలో తన పేరుని అచ్చులో చూసుకోవాలి అనే కోరిక చావలేదు.

ఎలా మరి ?

తనలాంటి వాళ్లకోసమే వివిధ శీర్షికలతో అనేక పత్రికలు నడిపే వుత్తరాల శీర్షికకి ప్రయత్నించా లనుకుంది.

పత్రికలు చదివి కథల మీద, కార్టూన్ల మీద నవలల మీద తన అభిప్రాయాలు వ్రాసి పోస్ట్ చేసింది.

ఏ పత్రికా ఆ వుత్తరాలని ప్రచురించకపోవటం, ఆశ్చర్యాన్ని, విచారాన్ని కలిగించాయి విద్యాధరికి.

ఈసారి వంటలు, పిండి వంటలు శీర్షికకి సేమ్యా పాయసం, పులిహోర తయారుచేసే విధానాల గురించి వ్రాసింది.

తిరిగొచ్చాయి అవి తిరుగు టపాలో.

ఓ పత్రిక కథల మీద వ్యాస రచన పోటీ ప్రక టించింది. భయంవేసినా, ఆ కథలన్నీ చదివి ఓపికగా వ్యాసం వ్రాసి పంపింది.

విద్యాధరి భయం నిజమయింది. వేసుకోలేదు వాళ్ళు.

నిరాశ, నిస్పృహలు చోటు చేసుకుంటున్న సమ యంలో సినిమా పత్రికలకు చిత్రసీమకి చెందినవారికి ప్రశ్నలు, స్త్రీల శీర్షిక నడిపే వార పత్రికలకి కుట్టు పని ప్రతీ ఆడపిల్ల నేర్చుకోవలసిన ఆవశ్యకత గురించిన వ్యాసాలు, డిటెక్టివ్ పత్రికలకి జోక్స్, వాళ్ళు ప్రకటించే పజిల్స్‌కి జవాబులు మొదలయినవి ప్రయత్నించింది.

విద్యాధరి కోరిక తీరనేలేదు, దాదాపు ఎనిమిది నెలల నుంచి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.

చివరికి వారం రోజులు తీవ్రంగా ఆలోచించగా ఓ ఆలోచన తట్టింది. ఈ దెబ్బతో పత్రికలో నా పేరు పడితీరాలి అనుకుని ఓ పత్రిక అందుకుని కథలు తిరగేసింది.

తర్వాత ఇన్‌లాండ్ లెటర్ అందుకుని ఇలా రాసింది

సంపాదకులకు,

మీ ఫిబ్రవరి సంచిక చదివాను. శిల్పి వ్రాసిన కథ 'అనురాగం' చదివాక నాకు ఆశ్చర్యము, కోపము కలిగాయి. ఆ కథ మా ఇంట్లో జరిగినదే. ఆ సంగతులన్నీ మా బంధుమిత్రులకు తెలుసు. ఇది ఆయన ఎవరయినా చెప్పగా విని రాసారో, లేక వూహించి రాసారో తెలుసుకోవాలని కుతూహలపడుతున్నాను. దయచేసి శిల్పిగారి చేత జవాబు ఇప్పించగలరని నమ్ముతున్నాను.

విద్యాధరి, వైజాగ్-8.

ఉత్తరం పోస్ట్ చేసింది ఆ పత్రికకి. ఆ ఉత్తరాన్ని ఆ పత్రిక ప్రచురించింది. విద్యాధరి పేరు చాలామంది పాఠకులు కూడా గుర్తించారు. వచ్చే సంచికలో శిల్పి జవాబు కోసం ఎదురుచూడసాగారు మరికొందరు.

విద్యాధరి అచ్చులో తన పేరు చూసుకుంది గర్వంగా.

అక్షర రూపము దాల్చిన ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక.

\- కాళోజీ